క్లుప్తంగా

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

పెగడపల్లి: పెగడపల్లి ఆదర్శ మోడల్ స్కూల్‌లో గంటల ప్రాతిపదికన ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ తెలుగు, ఇంగ్లిష్, కెమిస్ట్రీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ లేదా బీఎడ్, టీజీటీలో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ లేదా బీఎడ్, టీపీటీ, హెచ్‌పీటీ లేదా టెట్ క్వాలిఫైడ్ అయి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 10 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

15 లోపు..

రాయికల్: రాయికల్ ప్రతిమ ఫౌండేషన్ జీఎంఆర్ టాటా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రంలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్(బ్యాంకింగ్) హోమ్, హెల్త్, ఏసీ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, సోలార్ టెక్నీషియన్, మహిళలకు టేలరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్కిల్ కమిటీ సభ్యులు ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18–30 సంవత్సరాల్లోపు పదోతరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువత ఈనెల 15 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రాచీన కళలకు ప్రాణం

వెల్గటూర్: మండల కేంద్రంలో చిడుతల రామాయణ నాటక ప్రదర్శన రసవత్తరంగా సాగింది. శ్రీరామ భక్తాంజనేయ కళాబృందం వారితో బోధకుడు కొండగుర్ల చంద్రయ్య పర్యవేక్షణలో మంగళవారం ప్రారంభమైన ఈ చిడుతల రామాయణ నాటకం శనివారం శ్రీరామ పట్టాభిషేకంతో ముగిసింది. విప్ లక్ష్మణ్‌కుమార్ హాజరై కళాకారులను అభినందించారు. లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రాచీన కళలను బతికించాలనే ఉద్దేశంతో నెల రోజులుగా ఎంతో కష్టపడి నేర్చుకొని సమాజానికి మంచి సందేశమిచ్చే నాటక ప్రదర్శన చేయడం అభినందనీయమన్నారు. శైలేందర్ రెడ్డి, తిరుపతి, మురళి, సందీప్‌రెడ్డి, పూదరి రమేశ్, గుమ్ముల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఒకే డీఏ ఇస్తామనడం అన్యాయం

మేడిపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి ఉద్యోగులు బాధపడుతున్నారని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. అధికారంలోకి రాకముందు ఉద్యోగుల గురించి అనేక ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్.. ఇప్పుడు వారికి ఒకటే డీఏ ఇస్తానంటోందని విమర్శించారు. తక్షణమే అన్ని డీఏలు ఇవ్వాలని కోరారు. రంగాపూర్‌లో ఆమె శనివారం పర్యటించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వొద్దినేని హరిచరణ్‌రావు కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులున్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలి



కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

జగిత్యాల: తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ స్పందన అన్నారు. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా పలు వార్డుల్లో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'విధులపై ఎమ్మెల్యేకు అవగాహన లేదు'



మాట్లాడుతున్న కృష్ణారావు

కోరుట్ల: ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కు తన ఎమ్మెల్యే విధుల పట్ల ఎలాంటి అవగాహన లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలో శనివారం బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల్లో ముఖ్యమంత్రి ఫొటో పెట్టాలని రేవంత్‌రెడ్డి అడుక్కుంటున్నారని ఎమ్మెల్యే సంజయ్ దురుసుగా మాట్లాడడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి ఫొటోలు పెట్టాలనే నిబంధన ఉందని, ఆ విషయంపై ఎమ్మెల్యేకు అవగాహన లేకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్‌గౌడ్, నాయకులు ఎంబేరి నాగభూషణం, ఎంఏ వయీం, ముల్క ప్రసాద్, రంజిత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పిలుస్తోంది..



ఇటీవల ఇంటర్ అప్‌గ్రేడ్ అయిన ధర్మపురి కేజీబీవీ పాఠశాల

- జిల్లాలో మొత్తం 16 పాఠశాలలు
- 12 స్కూళ్లలో ఇంటర్ కోర్సులు

ధర్మపురి: నిరుపేద, మధ్యతరగతి, వెనకబడిన విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం కస్తూర్బా గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసింది. 2005లో ఏర్పాటు చేసిన ఈ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన భోజనం, ఉచిత పుస్తకాలు, దుస్తులు అందిస్తోంది. మొదట ఈ పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతుల వరకు నిర్వహించేవారు. రెండు సంవత్సరాల నుంచి ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేసి పేద విద్యార్థులకు మరింత సౌకర్యాన్ని కల్పించింది. కస్తూర్బా గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ప్రైవేట్‌కు దీటుగా విద్యనభ్యసించి ఉన్నత ర్యాంకులు సాధించారు. వీటన్నింటిని పరిగణలోని తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం మొదట కొన్ని పాఠశాలలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేసి 2025–26 విద్యాసంవత్సరానికి గాను మరిన్ని పాఠశాలలను అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

16 పాఠశాలలు..

జిల్లాలో మొత్తం 16 కస్తూర్బా గురుకులాలున్నాయి. వాటిలో రెండు సంవత్సరాల క్రితం 7 పాఠశాలలను ఇంటర్ అప్‌గ్రేడ్ చేసింది. జగిత్యాల, వెల్గటూర్, కోరుట్లలో ఎంపీసీ, బైపీసీ కోర్సులు, రాయికల్, సారంగాపూర్, ఇబ్రహీంపట్నం, పెగడపల్లిలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు ప్రవేశపెట్టి మంచి ఫలితాలను సాధించాయి.

కొత్తగా మరో ఐదు..

2025–26 విద్యాసంవత్సరానికి కొత్తగా మరో ఐదు పాఠశాలలను ఇంటర్ అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. వాటిలో ధర్మపురి, మల్యాల, మేడిపెల్లి, మల్లాపూర్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో మొదటి సంవత్సరం కంప్యూటర్ సైన్స్ కోర్సులను ప్రవేశపెట్టింది. ప్రతి కోర్సులో మొత్తం 40 మంది విద్యార్థులకు సీట్ల అవకాశం కల్పించింది. మొత్తం 16 పాఠశాలల్లో 12 పాఠశాలలు ఇంటర్ అప్‌గ్రేడ్ అయ్యాయి. మిగిలిన నాలుగు పాఠశాలలు బుగ్గారం, బీర్‌పూర్, గొల్లపల్లి, కొడిమ్యాల నూతన పాఠశాలలు కావడంతో ముందుముందు అప్‌గ్రేడయ్యే అవకాశాలున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



పదోతరగతి పాసైన విద్యార్థినులు జిల్లాలోని ఏ పాఠశాలలోనైనా తమకు నచ్చిన గ్రూపుల్లో చేరే అవకాశాలున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. ఇంటర్ తరగతులకు ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఎస్ఎస్‌సీ మెమో, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. నాణ్యమైన విద్య, రుచికరమైన మంచి భోజన వసతులు, ఉచిత దుస్తులు, పుస్తకాలు అందిస్తారు.

– అనుపమ, జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్(జీఈసీవో)



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వాహనాలతోపాటు బస్సులను సైతం ఇష్టానుసారంగా నిలపడంతో ప్రయాణికులు వెళ్లేందుకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలి.

– కొండ నాగరాజు

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కల్పన, జగిత్యాల డిపో మేనేజర్, సెల్ నం.: 9959225925

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

బక్రీద్ ప్రార్థనలు



పెగడపల్లి: బతికపల్లి మసీదులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



మేడిపల్లి: పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్



బుగ్గారంలో..

బక్రీద్ పండుగ వేడుకలను శనివారం ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. మసీదులు, ఈద్గాల వద్ద సామూహికంగా ప్రార్థనలు చేశారు. ఖురాన్ బోధించిన మార్గంలో నడవాలని పలువురు సూచించారు. ఒకరికొనరుకు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. గ్రామాల్లో ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కోరుట్లలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రాయికల్‌లో..



మెట్‌పల్లి: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ధర్మపురి దేవస్థానం కమిటీ మాజీ అధ్యక్షుడు జువ్వాడి కృష్ణారావు



జగిత్యాలరూరల్: చల్‌గల్ ఈద్గా వద్ద..



కథలాపూర్: తాండ్రియాలలో..



వెల్గటూర్: గుల్లకోటలో..



కమలాపూర్‌లో కూలీలతో ఉపాధ్యాయులు

ఊరూరా బడిబాట

ధర్మపురి: కమలాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు శనివారం గ్రామంలో ఉపాధిహామీ పనులు జరుగుతున్న ఎస్సారెస్పీ కాలువ వద్దకు వెళ్లి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మీ పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని, సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు మహేశ్, ఉపాధ్యాయులు మ్యాన పవన్‌కుమార్, ప్రీతి, రాజేశ్, కూలీలు తదితరులున్నారు.

రాయికల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఒడ్డెరకాలనీలో బడిబాట నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గట్టు రమేశ్, నర్సయ్య, ఉపాధ్యాయులు చెరుకు మహేశ్వరశర్మ, రాజేశం, రజిత, స్వరూప, రాజిరెడ్డి, శ్రీనివాస్, గంగరాజం, రవి పాల్గొన్నారు.

కథలాపూర్: భూషణరావుపేట, చింతకుంట గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్ల వద్దకెళ్లి కొత్తగా అడ్మిషన్లు తీసుకున్నారు. మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య, హెచ్ఎంలు రవి, రాజయ్య, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, జగన్ పాల్గొన్నారు.

సారంగాపూర్: మీ పిల్లలను మా బడికి పంపించండి.. ఉత్తమ బోధనతో మీ బిడ్డ బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తామని శనివారం బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కొల్వాయిలో ప్రధానోపాధ్యాయుడు కొలిచాల సత్యరాజ్, ఉపాధ్యాయులు వొడ్నాల రాజశేఖర్, గంప కిరణ్, బోయిని చంద్రశేఖర్, సారంగాపూర్‌లో గోవర్ధన్ ప్రసాద్ తదితరులున్నారు.

విహార యాత్రకు కథలాపూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం

కథలాపూర్: కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు శనివారం విహార యాత్రకు వెళ్లారు. రాష్ట్రంలోని వివిధ మార్కెట్ కమిటీలు రైతులకందిస్తున్న సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధ్యయనం చేయనున్నట్లు పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. మండల రైతులకు మార్కెట్ కమిటీ ద్వారా మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తామన్నారు. ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ శిరీష, డైరెక్టర్లు గంగాధర్, రాజారెడ్డి, చౌదరి, విజయ్, శంకర్, రమేశ్ పాల్గొన్నారు.



సిద్దిపేట మార్కెట్ కార్యాలయం వద్ద సభ్యులు

జీలుగ సాగుతో లాభాలెన్నో..

- కలియదున్నడంతో భూమి సారవంతం
- 30 రోజుల్లోనే పంట చేతికి..
- పెరగనున్న నీటి నిల్వ సామర్థ్యం

మల్లాపూర్: తక్కువ సారవంతమైన భూములకు ఎక్కడి నుంచో మట్టిని తీసుకొచ్చి పొలంలో వేసి డబ్బును వృథా చేసుకోవడం కన్నా.. నేల స్వభావాన్ని బట్టి పచ్చిరొట్ట ఎరువుల సాయంతో సారవంతంగా మార్చుకోవచ్చు. ఇందులో జీలుగ సాగు చక్కటి ఫలితాలనిస్తోంది. నేల స్వభావాన్ని బట్టి జీలుగ సాగు చేసుకుంటే ఆపై వేసే పంటలకు అనుకూలంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి లావణ్య సూచించారు. పచ్చిరొట్ట ఎరువుల కోసం నిర్దేశించిన మొక్కలను పొలంలోనే కలియదున్నడం వల్ల అవి కుళ్లి భూమిని సారవంతం చేస్తాయని పేర్కొంటున్నారు.

30 రోజుల్లో..

ఏక వార్షిక మొక్కల్లో ప్రథమ స్థానం జీలుగదే. మొక్కలు నాటిన 25 నుంచి 30 రోజుల్లోనే పంట ఏపుగా పెరుగుతుంది. ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలను సిద్ధం చేసుకోవాలి. దుక్కిలో 20 నుంచి 30 కిలోల యూరియా వేసి ఆపై విత్తనాలను చల్లుకోవాలి. బిందుసేద్యం ద్వారా అయితే సాళ్లలో విత్తుకోవాలి. మొక్కలు బాగా పెరిగేందుకు క్రమపద్ధతిలో తడులివ్వాలి. 25 నుంచి 30 రోజులకు మొక్క ఏపుగా పెరిగి పూత దశకు చేరుకుంటుంది. ఆ సమయంలో మొక్కలను మొదళ్ల వద్ద కత్తిరించాలి లేదా రోటోవేటర్ సాయంతో కలియదున్నాలి. దున్నిన అనంతరం 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను దుక్కిలో వేయాలి. సూపర్ ఫాస్ఫేట్ వల్ల మొక్కల అవశేషాలు బాగా కుళ్లి పచ్చిరొట్ట ఎరువులు తయారవుతాయి.



మల్లాపూర్ మండలంలో సాగవుతున్న జీలుగ పంట

విశేషమైన లాభాలు..

పొలంలో జీలుగను కలియదున్నిన తర్వాత అవి నేలకు, ఆపై వేసే పంటలకు విశేషమైన లాభాలందిస్తుంది. ప్రధాన పంటకు ముందస్తుగా నేలను తయారు చేస్తుంది. జీలుగ సాగు వల్ల మూడు టన్నుల పచ్చిరొట్ట ఎరువులు లభిస్తాయి. మొక్కలకు 2 శాతం నత్రజని, సూపర్ ఫాస్ఫేట్‌ను అదనంగా అందిస్తాయి. జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మధాతువులను పంటకు చేకూర్చుతాయి. నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతాయి.

నేల సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి దోహదం చేస్తాయి. లెగ్యూ జాతికి చెందిన మొక్క కావడంతో వేర్లలో నత్రజని స్థిరీకరణ అధికంగా ఉంటుంది. తుంగ, గెరిక వంటి కలుపు మొక్కలను అడ్డుకుంటుంది.

భూములు సారవంతం



జీలుగ పంట సాగు చేసి కలియదున్నితే ఆ భూములు సారవంతమవుతాయి. కేవలం 30 రోజుల్లోనే పంట చేతికొస్తుంది. మండలంలోని అగ్రోస్, రైతు సేవాకేంద్రాల్లో, పీఏసీఎస్ కార్యాలయంలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. 100 కిలోల బస్తా రూ.14,250 కాగా.. సబ్సిడీ రూ.7,125 పోను రూ.7,125కే ఇస్తారు. ఇందులో 30 కిలోల బస్తాకు సబ్సిడీ పోను రూ.2,137.50కు అందిస్తున్నారు. అవసరమైన రైతులు పట్టదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకు రావాలి.

– లావణ్య, మండల వ్యవసాయ అధికారి, మల్లాపూర్

వృద్ధాశ్రమంలో పండ్లు, బియ్యం పంపిణీ

కోరుట్ల: కోరుట్ల కాంగ్రెస్ నాయకులు శనివారం రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామ శివారులోని వృద్ధాశ్రమంలో శనివారం పండ్లు, బియ్యం పంపిణీ చేశారు. కోరుట్ల ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కోరుట్ల సెగ్మెంట్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు–రజిని దంపతుల పెళ్లి రోజు సందర్భంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో పేదలకు అన్నదానం చేశారు. తిరుమల గంగాధర్‌గౌడ్, కొంతం రాజం, సంగ లింగంయాదవ్, సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దమ్మ జాతర

కథలాపూర్: సిరికొండ గ్రామంలో పెద్దమ్మ జాతర శనివారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ సంఘం–2 ఆధ్వర్యంలో ప్రత్యేక వేడుకలు జరిపారు. ఉదయం దేవాలయంలో భక్తులు పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

స్కాలర్‌షిప్‌కు ఎంపిక



హర్షవర్ధన్

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 9వతరగతి చదువుతున్న వేములకుర్తి గ్రామానికి చెందిన రాచకొండ హర్షవర్ధన్ ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్ శనివారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి గాను మోడల్ స్కూల్ నుంచి ఒకే విద్యార్థి ఎంపికైనట్లు చెప్పారు. 9వతరగతి నుంచి 12వతరగతి వరకు సంవత్సరానికి రూ.12వేల చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందన్నారు.

పైడిమడుగు పాఠశాలలో..



వైష్ణవి

కోరుట్ల రూరల్: పైడిమడుగు ఉన్నత పాఠశాలలో 8వతరగతి చదువుతున్న దుర్గం వైష్ణవి ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం ఆనంద్ శనివారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఎన్ఎంఎంఎస్ ప్రతిభా పరీక్షలో వైష్ణవి అర్హత సాధించి రూ.48వేల స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వైష్ణవిని ఏపీసీ చైర్మన్ కాసోజి లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

కోర్టు తీర్పు చెంపపెట్టు

రాయికల్: తనపై కొందరు చేసిన ఆరోపణలకు కోర్టు తీర్పు చెంపపెట్టు అని రాయికల్ మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. కొంతమంది కక్షపూరితంగా వ్యవహరించారని, బాలికను అడ్డు పెట్టుకుని విష ప్రచారం చేశారని తెలిపారు.